విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు
- ప్రభుత్వ తీరుకు నిరసనగా ర్యాలీ, ఆందోళన

వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వికారాబాద్, నవంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడవక ముందే 51మంది గురుకుల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదన్నారు. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండడంతో ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని గుర్తు చేశారు. ఒకే ఏడాది 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని, వారు మృత్యువుని జయించారన్నారు. ఓ ఘటన జరిగి మరువక ముందే మరో ఘటన జరుగుతున్నదన్నారు. మద్యం శాఖకు మంత్రి ఉన్నారు.. విద్యా శాఖకు మంత్రి లేకపోవడం విడ్డూరమన్నారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు, మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతేనే వీరు స్పందిస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికే 51 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇప్పుడైనా స్పందించి హాస్టల్ విద్యార్థుల జీవితాలను బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేశ్, శివ ప్రసాద్, తేజ, రామకృష్ణ, ప్రవీణ్, బాలకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- కొనుగోలు కేంద్రం పరిశీలన

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బషీరాబాద్, నవంబర్ 28 : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కాశీంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. తేమ శాతాన్ని పరిశీలించిన తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం వద్ద అన్ని రకాల వసతులు ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ రైతుల నుంచి తీసుకున్న ధాన్యం వివరాలను నమోదు చేసేందుకు ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి పంపించాలన్నారు. కొనుగోలు చేసిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్, ఏపీఎం పద్మా రావు తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మండల పరిధిలోని గొట్టిగఖుర్దులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నిర్వాహకులు వండిన వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ భోజనం ఇలానే ఉంటుందా... ఎలాంటి వంటలు వండుతున్నారు.. తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. పర్యవేక్షణ లోపం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

వికారాబాద్, నవంబర్ 28 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నిరంతరం కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ఉదయం పూట స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. చురుకైన విద్యార్థులను గుర్తించి ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకనుగుణంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభించినందున త్వరగా సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతూ మొదటి సంవత్సరం బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. తరచుగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు చేపట్టాలన్నారు. ఇంటర్ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రతిఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరం చేపట్టిన పరీక్షా ఫలితాలను సమీక్షించారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వినోద్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- రంగారెడ్డి జిల్లా హార్టికల్చర్ అధికారి సురేశ్
- మామిడి, కూరగాయలు, పుష్పాలు, ఆయిల్ పామ్ సాగు పంటలపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

మొయినాబాద్, నవంబర్ 28 : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం ఆర్జించవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి సురేశ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి రైతు వేదికలో మామిడి, కూరగాయలు, పుష్పాలు, ఆయిల్ పామ్ సాగు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయిల్ పామ్ చేసుకునే రైతులకు ప్రభుత్వం అధిక ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. ఈ పంటను ఏ నేలలో నైనా సాగు చేసుకోవచ్చని తెలిపారు. మొక్కలు నాటడానికి తీసే గుంతలకు అయ్యే ఖర్చుతో పాటు మొక్కల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ పంట సాగుకు తక్కువ ఖర్చుతో పాటు అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. మామిడి తోట సాగుపై రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా తెగుళ్లు ఆశిస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు కిషన్‌రావు, శ్రీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి అనురాధ, జన అగ్రిటెక్ మేనేజర్ బాబు, చేవెళ్ల హెచ్‌వో కీర్తికృష్ణ, రామ్మోహన్‌రావు, ఏఈవోలు కుమార్, సునీల్‌కుమార్, ఉదయ కిరణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో అద్భుత విజయాలు

- కడ్తాల్ గ్రామ పంచాయతీ అభివృద్ధి భేష్
- సిక్కిం రాష్ట్ర గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు

సిక్కిం గ్రామ పంచాయతీల ప్రతినిధులతో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్ నవంబర్ 28 : జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీ), కేంద్రంలో గ్రామ పంచాయతీల పనితీరుపై రెండు రోజులు శిక్షణ పొందుతున్న సిక్కిం రాష్ట్ర గ్రామ పంచాయతీల ప్రతినిధులు గురువారం కడ్తాల్ గ్రామ పంచాయతీని సందర్శించారు. టీం కో ఆర్డినేటర్ జరీనా నేతృత్వంలో గ్రామ పంచాయతీ అధికారి సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ సొంత ఆదాయ నిధులు, వ్యయాలను ప్రత్యేక అధికారి వివరించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి వసతి ఏర్పాటులో తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ సిబ్బంది పని తీరును, పల్లె ప్రగతి, హరితహారం, ప్రజాపాలన తదితర కార్యక్రమాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి ఇతర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన రైతు వేదిక, పల్లె ప్రగతి వనం, నర్సరీ, వైకుంఠ ధామం, స్వయం సహాయక సంఘాల దుకాణాలు, గ్రామ పంచాయతీ పారిశుధ్య నిర్వహణ తీరును వారికి వివరించారు. ఈ సందర్భంగా సిక్కిం రాష్ట్ర ప్రజాప్రతినిధులు మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డితో పాటు పాలకవర్గాన్ని అభినందించారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలించిందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎంపీవో విజయ్, ఐకేపీ రాజేశ్వరీదేవి, మహిళా పొదుపు సంఘాల సభ్యులతో పాటు నాయకులు లాయక్ అలీ, అశోక్, చేగూరి మహేశ్, క్యామ వెంకటేశ్, ఉపేందర్, మహేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

- కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఎమిరిటస్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్, నవంబర్ 28 : ఇంజినీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఎమిరిటస్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో గల విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ద్వారా నిర్వహించే ఇన్నోవేషన్ ఇన్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్(ఐసీఐసీఐ-2024)పై మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రతాప్‌రెడ్డి, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక విద్యా రంగానికి అనుగుణంగా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మొబైల్ కమ్యూనికేషన్ మోడ్‌ల తాజా పురోగతిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, డీన్ డాక్టర్ పద్మజ, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, సీనియర్ అడ్మినిస్ట్రేటర్ వెంకటాచలం, ఐసీఐసీఐ-2024 సదస్సు కన్వీనర్ డాక్టర్ తులసీప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ వీజీ శివకుమార్ పాల్గొన్నారు.

సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

చేవెళ్ల టౌన్ : ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి

చేవెళ్లటౌన్, నవంబర్ 28: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. చేవెళ్లలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే వివరాలను తప్పులేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో 50 కంప్యూటర్లతో వంద మంది సిబ్బందితో సర్వే నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పకడ్బందీగా నమోదు చేయాలి

షాబాద్ : సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలు ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది నిర్వహిస్తున్న ఆన్‌లైన్ డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటింటి సర్వేలో సేకరించిన వివరాలన్నీ పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 30రకు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు తప్పనిసరి

నవాబుపేట : సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం నవాబుపేట మండల పరిషత్ కార్యాలయంలో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు చేశారు. అనంతరం చిట్టిగిద్ద నుంచి కేశవపల్లి వరకు రూ.95లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు పనులను ఎంపీడీవోతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పలు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట పీఆర్ డీఈ మాధవరెడ్డి, పీఆర్ ఈఈ ఉమేశ్‌కుమార్, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో తదితరులు ఉన్నారు.

వివరాల నమోదు వేగవంతం చేయాలి

మర్పల్లి : సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. అంతకు ముందు నర్సాపూర్ చిన్నతండాలో మంచినీటి సరఫరా కోసం వేసిన బోరును, కోటమర్పల్లి నుంచి ఇజ్రా చిట్టంపల్లి రోడ్డు, బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజమల్లయ్య, మిషన్ భగీరథ డీఈ రాంప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ జితేంద్ర తదితరులు ఉన్నారు.

నవాబుపేట : ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో సర్వే వివరాలను నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

గెజిటెడ్ అధికారుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

జిల్లా గెజిటెడ్ అధికారుల సమావేశంలో పాల్గొన్న సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు తదితరులు

ఆదిబట్ల, నవంబర్ 28 : జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస రావు కోరారు. జిల్లాలో గెజిటెడ్ అధికారుల సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రామారావు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. గెజిటెడ్ అధికారుల సంఘానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక హాల్‌ను కేటాయించాలన్నారు. 2025 డైరీని ప్రింట్ చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు సంయుక్త కార్యదర్శులను నామినేట్ చేస్తూ తీర్మానం చేసి వారికి ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీని ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఉద్యోగుల ఇండ్ల స్థలాల కోసం సొసైటీగా ఏర్పడి ప్రతి డివిజన్‌లో సమావేశం ఏర్పాటు చేసి సంఘాన్ని చివరి ఉద్యోగి వరకు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా సంఘం కార్యదర్శి శ్రీనేశ్‌కుమార్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, శ్రీరామ్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మల్టీ జోన్ 2 ఐజీపీ సత్యనారాయణ

వికారాబాద్, నవంబర్ 28 : పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. ముందుగా పోలీసులు గౌరవ వందనం చేసి స్వాగతం పలికారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లంబాడీ హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక

షాద్‌నగర్, నవంబర్ 28:షాద్‌నగర్ నియోజకవర్గ లంబాడీ హక్కుల పోరాట సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, బిక్‌నాథ్, ప్రధాన కార్యదర్శులుగా మోహన్‌నాయక్, రామూనాయక్, కోశాధికారిగా సీతారాం, కార్యదర్శిగా మోతీలాల్‌నాయక్, సలహాదారులుగా చందర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, మున్సిపల్ అధ్యక్షులుగా చందర్‌నాయక్, శివాజీ, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడిగా సంతోశ్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా బాబూరాజ్, నందిగామ మండల అధ్యక్షుడిగా రామూనాయక్, కొందుర్గు మండల అధ్యక్షుడిగా గోపాల్‌నాయక్, చౌదరిగూడ మండల అధ్యక్షుడిగా రవినాయక్, కేశంపేట మండల అధ్యక్షుడిగా జరుపుల రాజూనాయక్‌ను ఎన్నుకొని వారికి నియామక పత్రాన్ని అందజేశారు.

రైతుల ఖాతాల్లో త్వరలో ధాన్యం డబ్బులు

చింతపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ జిల్లా అధికారి గోపీకృష్ణ

రంగారెడ్డి, నవంబర్ 28 (నమస్తేతెలంగాణ): కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో త్వరలోనే డబ్బులు జమ చేయనున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గోపీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను మరో 2, 3 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సంఘాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వారి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు రావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. ఆ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు.

విద్యుత్ లైన్ల తొలగింపు పేరుతో రైతులను వేధించొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

షాబాద్, నవంబర్ 28 : దేవాదాయ భూముల నుంచి విద్యుత్ లైన్ల తొలగింపు పేరుతో రైతులను వేధించ వద్దని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రోనిగూడలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారాంపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సీతారామచంద్ర స్వామి దేవాదాయ భూములను ఆనుకుని పట్టా భూముల్లో వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న పోతుగల్, లక్ష్మారావుగూడ, ఎర్రోనిగూడ, మల్లారెడ్డిగూడ, గోపిగడ్డ, పోలారం తదితర గ్రామాల్లోని రైతులను విద్యుత్ అధికారులు భయాందోళనకు గురి చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. దేవాదాయ భూముల్లో నుంచి విద్యుత్ లైన్లను డీటీఆర్‌లను తొలగిస్తే వెంటనే వాటిని పట్టా భూముల్లో రైతులకు అనుకూలంగా అమర్చి సేద్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, షాబాద్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అయూబ్, సభ్యులు వీరేశం, సత్యంగౌడ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.